నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, సోమవారం 27 మే 2024 VIKARABAD




జిల్లా కేంద్రంలో భద్రపరిచిన పాఠ్య, నోట్ పుస్తకాలు

# పుస్తకాలు సిద్ధం

- వికారాబాద్ జిల్లాకు చేరిన 3.38 లక్షల పాఠ్యపుస్తకాలు
- 2.22 లక్షల నోటు పుస్తకాలు
- జిల్లాలో 96,502 మంది విద్యార్థులు
- బడులు పునఃప్రారంభం రోజే స్టూడెంట్స్‌కు అందించేలా విద్యాశాఖ ఏర్పాట్లు

బొంరాస్‌పేట, మే 26 : పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా తెలుగు, ఆంగ్లం మాధ్యమా ల్లో రెండు భాగాలుగా ముద్రించి పంపిణీ చేస్తున్నది. పార్ట్-1 పాఠ్య పుస్తకాలను విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే ప్రింట్ చేసి అందిస్తుండగా.. పార్ట్-2 పాఠ్య పుస్తకాలను దసరా సెలవుల తరువాత పాఠశాలలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం పార్ట్-1 పాఠ్య, నోటు పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. వాటిని మండలాలకు పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాకు ఈ విద్యాసంవత్సరంలో పార్ట్-1, పార్ట్-2 కలిపి మొత్తం 7,19,410 పాఠ్య పుస్తకాలు అవసరం. వాటిలో 5,27,030 పార్ట్-1 పాఠ్యపుస్తకాలు జిల్లాకు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,38,810 వచ్చాయి. అదేవిధంగా 4,60,422 నోటు పుస్తకాలు రావాల్సి ఉండగా 2,22,600 జిల్లాకు వచ్చాయి. వచ్చే నెల 12వ తేదీన పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండనున్నాయి.

## జిల్లాలో 96502 మంది విద్యార్థులు

వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో 96,502 మంది విద్యార్థులు చదువుతున్నారు.

1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను సర్కారు పంపిణీ చేస్తుండగా.. 6 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను కూడా అందిస్తున్న ది. 1 నుంచి ఐదోతరగతి వరకు చదివే విద్యార్థులకు వర్క్‌బుక్కులు, 6, 7, 8, 9,10వ తరగతి చదువుతున్న వారికి 14, ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులకు 10, రెండోఏడాది విద్యార్థులకు 12 నోటు పుస్తకాలను ఉచితంగా అందజేస్తారు.





# పకడ్బందీగా ఏర్పాట్లు

- కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు
- చేవెళ్ల పార్లమెంట్ ఫలితం కోసం 164 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు
- ఏడు సెగ్మెంట్లకు 777 సిబ్బంది నియామకం
- సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి
- మాస్టర్ ట్రైనర్స్‌తో సిబ్బందికి శిక్షణా తరగతులు

రంగారెడ్డి, మే 26 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల ఫలితాల వెల్లడికి ఇంకా తొమ్మిది రోజులు మాత్రమే ఉన్నది. బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు రిజల్ట్ కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి పక్కాగా ఫలితాన్ని వెల్లడించేందుకు అధికారయంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. చేవెళ్ల లోక్‌సభ ఓట్ల లెక్కింపును చేవెళ్లలో చేపట్టనుండగా.. కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని ప్రక్రియలను అధికారులు చురుగ్గా పూర్తి చేస్తున్నా రు. కౌంటింగ్ సిబ్బంది నియామకం..శిక్షణా కార్యక్రమాలను ముమ్మరం చేశారు.

## సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి..

చేవెళ్ల లోక్‌సభ బరిలో 43 మంది అభ్యర్థులు ఉండడంతో ప్రతి పోలింగ్ కేంద్రంలో నూ మూడు ఈవీఎంలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 56.40% పోలింగ్ నమో దైంది. మొత్తం 29,38,370 మంది ఓటర్లకుగాను 16,57,107 మంది ఓటేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 164 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అత్యధిక పోలింగ్ కేంద్రాలు ఉన్న మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కోసం 28 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేస్తుండగా..మిగతా నాలుగు నియోజకవర్గా ల్లో 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 24 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి టేబుల్ వద్ద ఓ సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులు, సూక్ష్మ పరిశీలకుడు ఉంటారు. ఈ లెక్కన చేవెళ్ల లోక్‌సభ ఓట్ల లెక్కిం పు కోసం 777 మంది ఎన్నికల సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఇందులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 227 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 273 మంది, మైక్రో అబ్జర్వర్లు 277 మంది ఉన్నారు. సిబ్బంది విధుల కేటాయింపునకు సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సైతం అధికారులు పూర్తి చేశారు. వీరికి మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణా తరగతులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రౌండ్ల వారీగా ఓట్ల వివరాలను పక్కాగా వెల్లడించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

## స్ట్రాంగ్ రూముల్లో భద్రంగా ఈవీఎంలు..

చేవెళ్ల లోక్‌సభ పార్లమెంట్ పరిధిలోని చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్ర నగర్, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 13న పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పటిష్ట భద్రత మధ్య ఈవీఎంలు, వీవీప్యాట్‌లను డిస్ట్రిబ్యూటరీ సెం టర్లకు.. అక్కడి నుంచి చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ప్రస్తుతం మూడంచెల భద్రతను కొనసాగుతుండగా..కౌంటింగ్ రోజున కౌంటింగ్ కేంద్రం చుట్టూ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బందితోపాటు వివిధ కంపెనీల పారామిలిటరీ బలగాలను సైతం భద్రత కోసం వినియోగించనున్నారు. కౌంటింగ్ రోజున కేంద్రంలోకి ఫోన్లకు అనుమతి లేదు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేయనున్నారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించనున్నారు.



వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని ఇబ్రహీంపూర్‌లో వర్షానికి తడిసిన ట్రాక్టర్‌పై ఉన్న ధాన్యం బస్తాలు

# వర్ష బీభత్సం

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు మామిడి తోటల్లోని కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల కుప్పలు తడిసిముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళ న చెందుతున్నారు. పలు చోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోగా విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో చెట్లు కూలి ఇండ్లు, రోడ్లు ధ్వంసమై భారీగా నష్టం వాటిల్లింది. కొన్ని గ్రామాల్లో ఇండ్లు, పశువుల కొట్టాలపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయి చెల్లాచెదురయ్యాయి.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



తుర్కయాంజాల్ మున్సిపల్ పరిధిలోని తొర్రూర్‌లో రాలిన మామిడి కాయలు



బొంరాస్‌పేట మండలంలోని పోలేపల్లిలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు



ధారూరు మండలంలోని నాగారంలో కురిసిన భారీ వర్షానికి ఇరిగిపడ్డ చెట్టు



ధారూరు మండలం నాగారం గ్రామ సమీపంలో విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభం,




ధారూరు మండలంలోని మైలారం ముదలి తండాలో ప్రాథమిక పాఠశాల ప్రహరీపై విరిగిపడ్డ చెట్టు



# వ్యర్థాలు తీయక.. దుర్వాసన వీడక

## కంపుకొడుతున్న కాలనీలు.. రహదారులు

- నీరుగారుతున్న ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం
- రోజూ అటెండెన్స్‌లోకి రాని వందలాది స్వచ్ఛ ఆటోలు
- అమలుకు నోచుకోని 'క్యూఆర్ స్కాన్' విధానం
- గ్రేటర్ వ్యాప్తంగా 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు గుర్తింపు
- రహదారులను ముంచెత్తుతున్న చెత్తాచెదారం

సిటీబ్యూరో, మే 26, (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో 'చెత్త'శుద్ధి కరువైంది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం నీరుగారుతున్నది. రహదారులను చెత్తాచెదారం ముంచెత్తుతున్నది. ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోతుండటంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రేటర్‌లో చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా దాదాపు మూడున్నరేండ్ల కిందట డస్ట్ బిన్ లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్‌ఎంసీ ఎత్తేసింది. మెరుగైన పారిశుధ్య నిర్వహణను పకడ్బందీ చేస్తూ వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కొక్క ఆటోకు కాలనీ వారీగా చూస్తే.. ఒకటి లేదా రెండు కాలనీలు గృహాల ప్రకారంగా గమనిస్తే.. ఒక్కొక్క అటోకు సుమారు 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండటం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్ ఉండటం లేదు. రోజూ వందలాది స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని స్వయంగా కమిషనర్ రొనాల్డ్ రాస్ ఇటీవల గుర్తించారు. స్వచ్ఛ ఆటోల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అయినా స్వచ్ఛ ఆటోల తీరు మారడం లేదు.

## అమలు కానీ క్యూఆర్ స్కాన్..

స్వచ్ఛ ఆటోల పనితీరులో ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం వెరసి.. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతున్నది. సమయ పాలన పట్టించుకోకపోవడం, చెత్త సేకరణలో అధిక వసూళ్లకు తెరలేపడం, సిటీలో ఉండాల్సిన స్వచ్ఛ ఆటోలు గ్రేటర్ సరిహద్దులు దాటడం వంటి ఘటనపై ఇప్పటికే ఫిర్యాదులు కొకొల్లలుగా వచ్చాయి. స్వచ్ఛ ఆటోలను దారిలోకి తీసుకురావడం, ఉదయం ఆటో బయట దేరే సమయం..వ్యర్థాల సేకరణ పూర్తయ్యాక ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వరకు వెళ్లే వరకు 'క్యూ ఆర్' స్కాన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. శానిటేషన్‌కు సంబంధించిన విభాగంలో ఏఎంహెచ్‌ఓలు, ఇంజినీరింగ్, ఎంటమాలజీ సిబ్బంది, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్లు ఉన్నా.. సమన్వయ లోపంతో పారిశుధ్యం అటకెక్కుతున్నదని, పర్యవేక్షణలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ నిర్లక్ష్యం ఉందన్న ఆరోపణలు లేకపోలేదు. ముఖ్యంగా వంద రోజుల కార్యాచరణకు అధికారుల కోసం ' మై జీహెచ్‌ఎంసీ 'యాప్‌ను అందుబాటులోకి తీసుకురాగా, పూర్తి స్థాయి వినియోగంలో ఉన్నతాధికారులు చేతులెత్తేయడంతో నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. తద్వారా నగర వీధులు ముక్కుపుటాలదిరే దుర్వాసనతో పాటు దోమల స్వైర విహారం ఎక్కువగా ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

## జీవీపీ పాయింట్లపై నిఘా ఏదీ?

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజి వనరేబుల్ పాయింట్లు/జీవీపీ)పై యాక్షన్ ప్లాన్ అటకెక్కింది. గ్రేటర్‌లో డస్ట్ బిన్‌లు ఎత్తివేసి..స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియ జరుపుతుండగా..అక్కడక్కడ కొందరు బహిరంగంగానే చెత్త వేస్తూ వస్తున్నారు. ఇలా గ్రేటర్ వ్యాప్తంగా 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు గుర్తించారు. కానీ జీవీపీ పాయింట్ల ఎత్తివేతలోనే అధికారుల అలసత్వం ప్రదర్శిస్తుండటం, జోనల్ కమిషనర్లు సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహించకపోవడం ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.